డా॥ ముక్తేవి భారతి



# బుచ్చిబాబు

శివరాజు వేంకట సుబ్బారావు 'బుచ్చి బాబు'గా సాహిత్యంలో పరిచితుడు. బుచ్చిబాబు 1916లో జన్మించారు. విశాఖపట్నంవాడై, ఇతను వేషభాషల్లో భావకవిలా వుండేవాడు. నవల కథ, నాటకాలు, సంగీత రూపకాలు ఎన్నో రచించిన సాహితీవేత్త. బుచ్చిబాబు గొప్ప చిత్రకారుడు.

బుచ్చిబాబు అనగానే వెంటనే స్ఫురించేది 'చివరకు మిగిలేది' అనే నవల. మనో వైజ్ఞానిక పరిశోధనల మూలంగా రచయితలు తమ సాహిత్య సృష్టిలో మనో వైజ్ఞానికతని ప్రవేశపెట్టారు. ఏ వ్యక్తి సుఖదుఃఖాలకైనా తనే బాధ్యుడా, ఎంత వరకు అనే ప్రశ్న బాల్యంలో జరిగిన సంఘటనల ద్వారా ఒక వ్యక్తి మనసుపై ఏదైనా ముద్రపడితే అది అతని జీవితాన్ని ఎప్పటికీ వెనక్కి నెడుతుందా - ఇలా రకరకాల ప్రశ్నలు మనసులో ఉదయించటమనే అంశాన్ని ప్రధానంగా తీసుకుని మనో వైజ్ఞానిక నవలా రచన చేపట్టారు రచయితలు.

ఈ నేపథ్యంలో వచ్చిందే బుచ్చిబాబుగారి 'చివరకు మిగిలేది' నవల.

'చివరకు మిగిలేది' నవల తెలుగు సాహిత్య పురోగమనంలో ఒక మైలురాయి. భావనాత్మక ప్రేమ, ఆదర్శాలు, జీవిత సత్యం ముందు దివిటీలు సూర్యుని ముందు కాంతి విహీనమైనట్టు నిరుపయోగం కావటాన్ని చిత్రిస్తుందా నవల" అన్నారు ప్రఖ్యాత విమర్శకులు ఆర్.ఎస్. సుదర్శనం గారు.

జీవితంలో అనుభవాలు, అసంతృప్తి అన్నిటినీ దిగమించిన పిదప చివరకు మిగిలిందేమిటీ - ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకునేందుకు చేసిన ప్రయత్నాలు జ్ఞాపకాలతో సమాధాన పడడమే అనే ముగింపే ఈ నవల లక్ష్యాన్ని చూపిస్తుంది.

ఇ.డి.ఎస్. కాంప్లెక్స్ స్పష్టంగా చూపిన నవల ఇది. మనోవైజ్ఞానిక నవలకి మూలం సిగ్మండ్ ఫ్రాయిడ్, అనే మనస్తత్వ వేత్త సిద్ధాంతాలు.

ఈ నవలలో నాయకుడు దయానిధి. తల్లిమీద విపరీతమైన ప్రేమ కానీ లోకం దృష్టిలో ఆమెకు గౌరవస్థానం లేదు. తల్లి ప్రవర్తన గురించి వచ్చిన వదంతులు, తల్లిపై లోకం చూపే అనాదరణ దయానిధి మనసులో గాఢంగా నాటుకున్నాయి. తల్లిని ఎవరైనా నిందిస్తే వారిని ద్వేషించేవాడు. తల్లిని గురించి తప్ప మరొకరి గురించి ఆలోచింపలేకపోయేవాడు. తల్లి మరణం అతనిలో శూన్యాన్ని మిగిల్చింది. అతని బాహ్య అంతర వ్యక్తిత్వాలు అచేతనలోనే కలిసిపోయాయి. ఈ నవలలో కోమలి,



అమృతం అనే స్త్రీ పాత్రలు దయానిధి జీవితాన్ని ఎన్నో కోణాల నుంచి ఆక్రమించుకున్నాయి.

బుచ్చిబాబు ఈ నవలకి ఏకాంతం అనే పేరు పెట్టుకున్నాడట. ఆచంట జానకిరామ్ గారు చివరకు మిగిలేది అనే పేరు సూచించినట్టు తెలుస్తుంది (తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రి).

బుచ్చిబాబు కథానికలు ఏడు సంపుటాలుగా వెలువడ్డాయి. బుచ్చిబాబు కథలు మానవ ప్రవృత్తి గురించి ఆలోచిస్తూ తాత్త్విక చింతనవైపు మనసు మరలిస్తూ, పాఠకుణ్ణి ఆలోచింపచేస్తాయి. కథా వస్తువుని ఎన్నుకోవటం, చెప్పే విధానం, భాష, శిల్పం, ఒక ప్రత్యేకతని కనబరుస్తాయి. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో తెలుగు ప్రజల్లో, ముఖ్యంగా యువతీ యువకుల్లో వున్న జీవిత సమస్యల్ని చిత్రించారు బుచ్చిబాబు తన కథల్లో.

బుచ్చిబాబు గారు రాసిన కథల్లో నాగాజుమేడ, ముగింపు మీకు తెలుసు. జ్ఞాననేత్రం, పొగలేని నిప్పు, ఎల్లోరాలో ఏకాంత సేన, అరకు లోయలో కూలిన శిఖరం - ఇలా ఎన్నెన్నో బాగా ప్రచారాన్ని పొంది, పాఠకుల చేత చదివించాయి.

బుచ్చిబాబుగారి నాటకాలు, నాటికలు చాలా వున్నాయి. వ్యాసాలు రచించారు బుచ్చిబాబుగా. ఆద్యంతాల మధ్య రాధ, ఉత్తమ ఇల్లాలు, దారినపోయే దానయ్య, గొలుసు మొదలైనవి ప్రసిద్ధి పొందిన నాటకాలు.

బుచ్చిబాబుగారు ఆకాశవాణిలో ఉద్యోగం చేస్తూ ఎన్నో నాటికలకు ప్రయోక్తంగా ఉండేవారు. ఆద్యంతాల మధ్య రాధ అనేది పన్నెండు నాటికల సంపుటి. దీనిలో విశేషమేమిటంటే, ఒకే ఇతివృత్తానికి, ఒకే కుటుంబానికి సంబంధించిన నాటికలు ఇవి కావటం. ఈ శ్రవ్య నాటికలు మధ్యతర గతి కుటుంబాలకి ప్రతీకలు.

గాజుమేడ అనేనాటిక రాశారు. దీని ఇతివృత్తం చాలా విశేషమైనది. సత్యం, శివం, సుందరం, అనే పాత్రలు ముఖ్యమైనవి ఈ నాటకంలో. విశ్వాంతరాళంలో గాజుమేడ సృష్టించడం అందులో సోక్రటీస్, షేక్స్‌పియర్, గురజాడ, రంగాజమ్మ అనే వారంతా ఆ గాజుమేడలో కలుసుకోవటం, కబుర్లు చెప్పుకోవటం జరిగింది. ఇది శ్రావ్య నాటికగా బాగా పేరు పొందింది.

బుచ్చిబాబుగారి నిత్య జీవితంలో 'చివరకు మిగిలేది' నవల ఒక విశిష్ట స్థానాన్ని పొందినా, వ్యాసకర్తగా కథా రచయితగా ఒక ప్రత్యేక స్థానాన్ని పొందారు బుచ్చిబాబుగారు.

ప్రకృతి చిత్రాలు మూడు వందలకు పైగా గీసిన చిత్రకారుడు బుచ్చిబాబుగారు.

తెలుగు సాహిత్యంలో మనోవైజ్ఞానిక నవలగా రచించిన 'చివరకు మిగిలేది' తరువాతి రచయితలకు మనోవైజ్ఞానిక కథా విధానానికి పాత్ర చిత్రణకి దారి చూపించింది.

*